క్లుప్తంగా

రాములు మాస్టారుకి ఎమ్మెల్యే నివాళి



రాములు మాస్టారి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో బంధువుల సందర్శనార్థం ఉంచిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డోకల రాములు మాస్టారి పార్థివదేహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. ఎమ్మెల్సీ రఘువర్మ కూడా బాధిత కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించారు.

ఘనంగా పైడితల్లి సంబరాలు

వంగర: మండలంలోని మడ్డువలస గ్రామంలో పైడితల్లి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు గ్రామం చేరుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆటంకం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

బొబ్బిలి: స్థానిక సింగారపు వీధిలోని వేంకటేశ్వరాలయంలో చిన్నారులు ఆదివారం ప్రదర్శించిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎం.విజయమోహనరావు, చప్పల అప్పలనాయుడు, పి.నాగరాజు, ఆలయ ధర్మకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ప్రేమజ, సాంబయ్య

బొబ్బిలి: స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య, సావిత్రిబాయి పూలే సంఘ నియోజకవర్గ అధ్యక్షురాలు సురిపల్లి ప్రేమజ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. మహిళల హక్కులు, విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా సావిత్రిబాయి పూలే గుర్తింపు పొందారన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కుమ్మరి వీధివాసులు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో బావి రేవతమ్మ ఆలయ పునర్నిర్మాణానికి కమ్మరివీధికి చెందిన భక్తులు రూ.31,360లను విరాళంగా ఆదివారం అందజేశారు. మందిరం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో ఘనజీవామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎకరం విస్తీర్ణానికి 200 కేజీల ఆవుపేడ 10 లీటర్ల ఆవుమూత్రం, 2 కేజీల పప్పుల పిండి, 2 కేజీల బెల్లం, గుప్పెడు పుట్టమన్ను కలిపిన ఉండలను నీడలో ఆరబెట్టుకుని దుక్కిలో చల్లుకోవాలి. దీంతో ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభిస్తూ పంటలు పండిస్తే పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమాదేవి తెలిపారు.

అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలి

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. స్థానిక పట్టణంలోని వాసవీనగర్, ప్రధాన రోడ్డు, మాధవబజార్, ఠాణావీధి వార్డుల్లో ఆదివారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య కార్యక్రమాలపై చర్చించారు. పక్కాగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, స్వచ్ఛ రాజాం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, తోట తిరుమలరావు, పాలవలస శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల కోసం చేపట్టిన ఆర్‌బీకే భవన నిర్మాణం



ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం



రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రం



నాడు-నేడు నిధులతో మార్చిన పాఠశాల రూపురేఖలు

ప్రగతి పథంలో సోమరాజుపేట

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చొరవతో గ్రామంలో జోరుగా అభివృద్ధి పనులు
- రూ.10.02 కోట్ల నిధులతో ప్రభుత్వ భవనాలు, రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం
- మౌలిక సదుపాయాలు మెరుగుపడడంతో ఆనందంలో గ్రామస్తులు



జల్ జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు



రేగిడి: మండలంలోని సోమరాజుపేట పంచాయతీ ప్రగతి పథంలో పయనిస్తోంది. గత 58 నెలల కాలంలో గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా రూ.10.02 కోట్ల నిధులతో అభివృద్ధి, సంక్షేమం జరిగింది. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా ఆలోచన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. దీంతో ప్రతీ గ్రామంలో కొన్ని రూ.లక్షల నిధులతో గ్రామ సచివాలయ భవనంతో పాటు ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం), హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు ఏర్పాటై, తద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా చేశారు. వీటితో పాటు ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మించడంతో పాటు తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమం కోసం అనేకానేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో గత 30 ఏళ్లలో చూడని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూస్తున్నామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గ్రామంలో పర్యటించి, ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. దీంతో సోమరాజుపేట పంచాయతీకి మహర్దశ పట్టినట్లయింది.



కొత్తగా నిర్మించిన గ్రామసచివాలయ భవనం

అభివృద్ధి, సంక్షేమం ఇలా..

గ్రామంలో రూ.43.06 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.23.01 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం భవనం, రూ.20.08 లక్షల నిధులతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రూ.4 లక్షలతో చెత్త సంపద తయారీ కేంద్రం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేశారు. మరో రూ.30 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధుల ద్వారా 360 ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీరు సరఫరా చేశారు. రూ.18.39 లక్షల నాడు–నేడు నిధులతో గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. ఆయా అభివృద్ధి పనులతో గ్రామం సరికొత్త రూపును సంతరించుకుంది. ఇవేకాకుండా అవినీతికి తావులేకుండా డీబీటీ విధానం ద్వారా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల నిధుల ద్వారా 2305 మంది లబ్ధిదారులకు రూ.6,83,03,087 లబ్ధి జరగ్గా, నాన్ డీబీటీ విధానం ద్వారా రూ.2,33,23,636 లబ్ధి గ్రామంలోని ప్రజలకు జరిగింది. ఈ మొత్తం లబ్ధి ద్వారా గ్రామంలోని 3006 మందికి ఆర్థికంగా మేలు జరిగిందని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.



ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

ఎప్పుడూ చూడని అభివృద్ధి..



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మా గ్రామంలో ఎప్పుడూ చూడని అభివృద్ధి చూస్తున్నాం. సీఎం జగనన్న చొరవతో అనేకానేక అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు గ్రామంలో జరిగాయి. గతంలో ఏ ప్రభుత్వమూ గ్రామానికి గానీ గ్రామంలోని ప్రజలకు గానీ ఇంతమేర మేలు చేయలేదు. ప్రస్తుతం గ్రామంలోని ప్రజలంతా అన్నివిధాలా సంతోషంగా ఉన్నారు.

–సవకాపురపు రమేష్‌నాయుడు, సర్పంచ్, సోమరాజుపేట.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్షల నిర్వహణపై ఆరా తీస్తున్న రాష్ట్ర పరిశీలకుడు మార్టిన్

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు మార్టిన్ ఇక్కడి గురుకులాన్ని ఉదయం సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం పారదర్శకంగా సీట్ల భర్తీ చేయాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు మాట్లాడుతూ గురుకుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఐదో తరగతికి సంబంధించి 219 మందికి గాను 162 మంది, ఇంటర్మీడియట్‌కు సంబంధించి, 227 మందికి గాను 108 మంది హాజరయ్యారని తెలిపారు.

వంగర: మండలంలోని మడ్డువలస దగ్గరున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా సాగింది. ఇంటర్మీడియట్‌కు సంబంధించి, 114 మందికి గాను 94 మంది విద్యార్థులు, ఐదో తరగతికి సంబంధించి, 114 మందికి గాను 92 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు.

ప్రభుత్వం చేసిన మేలు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్వరరావు

మెంటాడ: ప్రతీ ఇంటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గేదెల సతీశ్వరరావు సూచించారు. ఆదివారం మండలంలోని చల్లపేట గ్రా మంలో జరిగిన పార్టీ నేతల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న సర్కారు చేసి న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా పనిచేయాలని, ప్రతీ ఇంటికి ప్రభుత్వం ద్వారా కలి గిన లబ్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, ఎంపీ పీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వ రరావు, జేసీఎస్ కన్వీనర్ కనిమెరక త్రినాథ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తాగునీటి పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో పలు వీధుల్లో రూ.20 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం ఇదే గ్రామ ఎరుకల కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే సంక్షేమం, అభివృద్ధి చేరుతున్నాయన్నారు. ప్రజాసంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామాల్లో మారిన పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు టీడీపీ నేతల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రగతి పనులు అభివృద్ధి కిందికి రావా అని నిలదీశారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులు..

ఓటమి భయంతోనే బీజేపీ, జనసేన తదితర ప్రతిపక్షాలతో చంద్రబాబు పొత్తులు పెట్టుకుంటున్నారని ఎమ్మెల్యే శంబంగి విమర్శించారు. గతంలో ఘోరంగా తిట్టిన పార్టీలతో చంద్రబాబు ఏ మొహం పెట్టుకుని మళ్లీ పొత్తు పెట్టుకున్నారని ప్రశ్నించారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేవన్నారు. సీఎం జగనన్నను ఎలాగైనా ముఖ్యమంత్రి పీఠం నుంచి దింపాలనే కుట్రతో ప్రతిపక్షాలన్నీ అడ్డదారులు తొక్కుతున్నాయన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజల ముందుకొస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా ప్రజలతోనే పొత్తు పెట్టుకున్నారని, ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీని ఓడించలేరన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం మరింత జరగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపీటీసీ సామిరెడ్డి రమణమ్మ, పార్టీ మండల నాయకురాలు అప్పికొండ నిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రేగిడి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పా టు పరిసరాల పరిశుభ్రత పాటించాలని రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూ నిట్ పీవో సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాలకవివలస గ్రామంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ప్రత్యేక సేవా శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్లల్లో ఉన్నత చదువులు చదివిన వారు ఉండాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలను బాగా చదివించాలన్నారు. డిజిటల్ విద్య ఆవశ్యకత, ప్రయోజనాలను అధ్యాపకుడు రమేష్ వివరించారు.

చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



కొట్టక్కి లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో ఉన్న లూథరన్ చర్చిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి పాస్టర్ శ్యామ్‌కుమార్ ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికి, ఏసుక్రీస్తు ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలు, అన్నిమతాల వారి సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపీటీసీ సామిరెడ్డి రమణమ్మ, పార్టీ మండల నాయకురాలు అప్పికొండ నిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

రాజాం: స్థానిక గాయత్రి కాలనీలోని క్రీస్తు ప్రార్థనా మందిరంలో పూలమొక్కల పంపిణీ ఆదివారం చేపట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళలు, చిన్నారుల కు మొక్కలు అందజేశామని రాజాం హోసన్నా అపోస్తులిక్ మినిస్ట్రీస్ పాస్టర్ సిస్టర్ పూజ రత్నకుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు.

నేడు పోరాంలో 'వైఎస్సార్ చేయూత'

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామంలో వైఎస్సార్ చేయూత కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆదివారం తన స్వగృహంలో పార్టీ నేతలతో సమావేశమై, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హాజరవుతున్నారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులంతా హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ నేతలు లెంక రత్నాకరనాయుడు, తాడ్డి రామునాయుడు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని తెలిపే కరపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు కోరారు. మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆయా నేతలు ఆదివారం పర్యటించి, ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభు త్వం ద్వారా ఎవరికి ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించే కరపత్రం అందజేశారు. ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలవాలన్నారు. పేదోళ్ల బాగుండాలంటే వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆకాంక్షిస్తూ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు స్థానిక పట్టణంలో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ నాగేశ్వరరావు నేతృత్వంలో గొల్లపల్లి, దిబ్బ వీధి, సిరిపురపు వీధిలో పోలీస్ సిబ్బంది కవాతు ప్రదర్శన చేపట్టి, ప్రతీ ఓటరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ప్రజలను కోరారు. ఎవరైనా బెదిరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేకే ఆరోపణలు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు, సర్పంచ్ శశిభూషణరావు

రేగిడి: తమ రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక కొంతమంది టీడీపీ నేతలు, కార్యకర్తలు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు మండిపడ్డారు. ఇదే విషయమై వారు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. తమ గ్రామంలో సర్వే నంబర్ 64–2లో ఉన్న 3.12 ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు భూమిని తాము ఆక్రమించినట్లు టీడీపీ శ్రేణులు ఓ మీడియా ద్వారా ప్రచారం చేశారని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. వాస్తవానికి ఆ భూమి ఇదే గ్రామానికి చెందిన శాసపు, రెడ్డి కుటుంబాల స్వాధీనంలో ఇప్పటికీ ఉందని తెలిపారు. తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పావులా వాడుకుని కొంతమంది మండల టీడీపీ కార్యకర్తలు ఇలా చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. గతంలో తాము గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2.50 కోట్ల విలువైన 50 సెంట్ల భూమిని దానం చేశామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కేవలం రాజకీయ ఉనికి కోసం తమపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక ఓటర్లున్న రేగిడి మండలాన్ని టార్గెట్ చేసి మరీ టీడీపీ నేతలు, కార్యకర్తలు చేసే ఆరోపణలు వాస్తవం కాదన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తమ రాజ కీయ ఎదుగుదలను అడ్డుకోలేరన్నారు. ఆక్రమణలపై వారు చేస్తున్న ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఆరోపణలు చేసే వ్యక్తులు బయటకు రావాలని, లేకుంటే న్యాయస్థానం ద్వారా పరువునష్టం దావా వేస్తామన్నారు.